పనిచేయకపోతే పంపించేస్తా!

- విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు
- అధికారులను హెచ్చరించిన కలెక్టర్ అరుణ్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, శ్రద్ధపెట్టి పని చేయక పోయినా వేటు తప్పదని కలెక్టర్ అరుణ్‌బాబు హెచ్చరించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని స్పందన హాలులో రెవెన్యూ, హౌసింగ్, ఐసీడీఎస్, ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు, ఉపాధి హామీ, సంక్షేమ కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమీక్షించారు. జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్య, డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, తాను క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లాను అన్నింటా అగ్రస్థానంలో నిలిపాలన్నారు.

ధర్మవరం ఆర్డీఓ, తహసీల్దార్‌కు మందలింపు

భూ రీ సర్వే పనులను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రీసర్వేలో వెనుకబడి ఉన్న ధర్మవరం ఆర్డీఓతో పాటు సీకేపల్లి తహసీల్దార్‌ను మందలించారు. సర్వే రాళ్లు నాటడం ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని ప్రశ్నించగా, వారిద్దరూ ఏవో సమస్యలు చెప్పేందుకు ప్రయత్నించారు. దీంతో కలెక్టర్ తీవ్రంగా స్పందించారు. భూ వివాదాల పరిష్కారానికే రీసర్వే నిర్వహిస్తున్నాం. సమస్యలు రాకుండా ఎలా ఉంటాయి, వాటిని పరిష్కరించుకుంటూ ముందుకు పోవాలన్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రాళ్లు నాటే పని త్వరగా పూర్తి చేయాలన్నారు.

పోషణ కిట్ల నాణ్యతను పరిశీలించాలి

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషణ కిట్లు నాణ్యంగా ఉన్నాయో... లేదో తప్పకుండా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, కార్యకర్తలతో ప్రతి వారం సమీక్షించాలని పీడీ లక్ష్మీకుమారిని ఆదేశించారు. కేంద్రాలను మరింత బలోపేతం చేయాలన్నారు. 10వ తేదీలోపు పురోగతి చూపాలన్నారు. ఆరోగ్యం బాగా లేకపోతే సెలవులో వెళ్లిపోవాలన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో పిల్లల ఆరోగ్యంపై వెల్ఫేర్ అసిస్టెంట్లు ఆరా తీయాలని, ఇందులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. ఉపాధి హామీ పథకంలో రోజూ లక్ష మంది వరకూ పనికి వచ్చేలా చూడాలన్నారు. వర్షాకాలంలోపు 'అమృత్ సరోవర్' పనులు పూర్తి చేయాలన్నారు.

పద్ధతి మార్చుకోండి

వివిధ అభివృద్ధి పనుల్లో అమడగూరు, నల్లమాడ, మడకశిర, కదిరి మండలాలు చాలా వెనుకబడి ఉన్నాయని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకుని పనితీరు మెరుగుపరుచుకోవాలన్నారు. ఆర్డీఓలు భాగ్యరేఖ, తిప్పేనాయక్, రాఘవేంద్ర, సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రషీద్‌ఖాన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, సోషల్ వెల్ఫేర్ డీడీ శివరంగప్రసాద్, డీఏఓ సుబ్బారావు, డీహెచ్‌ఓ చంద్రశేఖర్, మెప్మా పీడీ విజయలక్ష్మి, జిల్లా పరిశ్రమ శాఖ అధికారి చాంద్‌బాషా, డీఈఓ మీనాక్షి, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, కమిషనర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారించాలి

రొద్దం: గ్రామీణ ప్రాంతాల్లో ఏ మహిళ కూడా రక్తహీనతతో బాధపడకూడదని, ఇందుకు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని కలిపి గ్రామంలో పర్యటించారు. ఆరోగ్య ఉప కేంద్రం వద్ద గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భవతులు ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైఎస్సార్ కిట్లను ప్రతి గర్భిణీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అప్పుడే రక్తహీనత అనే సమస్య ఉండదన్నారు.

బియ్యం లారీ పట్టివేత

సోమందేపల్లి: అక్రమంగా కర్ణాటకకు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని సోమందేపల్లిలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కర్నూలు జిల్లా బనగానపల్లి నుంచి కర్ణాటకకు బియ్యం తరలిస్తున్నట్లుగా ప్రాథమిక విచారణలో తేలింది. విషయం తెలుసుకున్న బియ్యం యజమాని అహమ్మద్ ఖాన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని కర్నూలు జిల్లాలో ప్రభుత్వం వేసిన వేలంలో ఈ బియ్యాన్ని తాను కొనుగోలు చేసినట్లుగా వివరించాడు. ఇందుకు సంబంధించి చూపిన రికార్డులను రెవెన్యూ అధికారుల ద్వారా ధ్రువీకరించుకున్న అనంతరం వాహనాన్ని సాయంత్రం పోలీసులు వదిలి వేశారు.

ఘనంగా జ్యోతులు


జ్యోతులతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

లేపాక్షి: మండలంలోని గౌరిగానిపల్లి గ్రామంలో సద్గురు కుశలానంద స్వామి 31వ ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు జ్యోతిని వెలిగించుకుని ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి స్వామివారికి సమర్పించారు. అనంతరం గణపతి పూజ, గంగపూజ, శివకోటి ప్రారంభం, కలశస్థాపన, రామలింగేశ్వరస్వామి, ఆంజనేయస్వామికి అభిషేకం, నవగ్రహపూజ, దివ్య జ్ఞానేశ్వరి, ఈశ్వరమ్మలకు పూజలు నిర్వహించారు.

శంకర మఠంలో విశేష పూజలు


శంకరాచార్యుల నగరోత్సవం

హిందూపురం: జగద్గురు శంకరాచార్యుల జయంతి మహోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక కోటా ఏరియాలోని శంకర మఠంలో భవానీశంకర సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాగణపతి, శారదాదేవి, శంకరాచార్యుల మూర్తులకు విశేష పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకం, యతిపంచకపూజలు నిర్వహించారు. అనంతరం శంకరాచార్యుల ఉత్సవమూర్తిని పూలపల్లకీలో కొలువుదీర్చి మేళతాళాల మధ్య నగరోత్సవం నిర్వహించారు.

ఇద్దరికి గాయాలు

గోరంట్ల: గుంతపల్లి సమీపంలో గోరంట్ల–పుట్టపర్తి రోడ్డుపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పులేరు పోస్టుమాస్టర్ రవినాయక్, ఆయన తండ్రి వెంకట్ నాయక్ తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. వీరిద్దరూ పుట్టపర్తి మండలం బత్తపల్లి గ్రామం నుంచి బైక్‌లో వస్తుండగా గుంతపల్లి సమీపంలో బెంగళూరు వైపు నుంచి వస్తున్న కారు ఢీకొని ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన ఇద్దరినీ హిందూపురం ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మృతుడు సిద్ధేశ్

మడకశిర(అగళి): విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అగళి మండలం ముక్కడంపల్లి గ్రామానికి చెందిన సిద్ధేశ్(33) గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం రామన్నపల్లి క్రాస్‌లో గొర్రెలను మేపుతుండగా వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. గమనించిన స్థానికులు వెంటనే బాధితుడిని రొళ్ల ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సిద్ధేశ్ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రస్తుతం ఆయన భార్య గర్భిణి. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఘటనపై అగళి ఎస్‌ఐ లావణ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చిరుత దాడిలో గొర్రె మృతి


గొర్రె కళేబరం

రొళ్ల: చిరుత దాడిలో ఓ గొర్రె మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు... రొళ్ల మండలం కాల్వేపల్లికి చెందిన కరియన్న గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. గ్రామ శివారులోని కల్లంలో సోమవారం రాత్రి గొర్రెలను వదిలి నిద్రకు ఉపక్రమించినప్పుడు అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ చిరుత మందలోకి చొరబడి ఓ గొర్రెను నోట కరుచుకుని ఈడ్చుకెళ్లింది. ఆ సమయంలో గొర్రెల అలజడికి నిద్ర లేచిన కరియన్న, మిగిలిన కాపర్లు వెంటనే అప్రమత్తమై గట్టిగా కేకలు వేస్తూ చిరుతను వెంబడించడంతో అది పారిపోయింది. అప్పటికే గొర్రె మృతి చెందింది. దీంతో దాదాపు రూ.12 వేలు నష్టం వాటిల్లినట్లు కాపరి కరియన్న వాపోయాడు. కాగా, సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గ్రామంలోని మరో ఇద్దరికి చెందిన గొర్రె పిల్లలను చిరుతల ఎత్తుకెళ్లినట్లు సమాచారం.

పేదల అభ్యున్నతే జగనన్న ధ్యేయం

- ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ


సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

గోరంట్ల: పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ విజ్ఞప్తి చేశారు. మండలంలోని వడిగేపల్లి పంచాయతీ బోయిలపల్లి, బీఎన్‌తండా, బత్తలపల్లి తండా, గొలపల్లి గ్రామాల్లో మాజీ సర్పంచ్ సరోజబాయి, మండల ఉపాధ్యక్షుడు నాగభూషణరెడ్డి నేతృత్వంలో మంగళవారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి నవరత్నాల ద్వారా ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను వందశాతం అమలు చేశారన్నారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు గుప్పిస్తున్న తెలుగుదేశం పార్టీ, దానికి వంత పాడుతున్న ఎల్లో మీడియాను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలేజయరాం నాయక్, ఎంపీపీ ప్రమీల, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫక్రుద్దీన్ సాహెబ్, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరిశంకర రెడ్డి, గోరంట్ల మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు నూర్‌మహమ్మద్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ బాషా, నాయకులు గొల్ల శంకర్, మైలారప్ప, రామాంజినరెడ్డి, శ్రీనివాసరెడ్డి, అశ్వర్థరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, శంకరనాయక్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఇసుక తవ్వకాలు జరగాలి

పరిగి: మండల కేంద్రంలోని జయమంగళీ నదిలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ నుంచి ఇష్టారాజ్యంగా ఇసుక తరలిస్తున్నారని ఆరోపిస్తూ వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ నాయకుడు ప్రభాకర్, మండల కన్వీనర్ నరసింహమూర్తి, సర్పంచ్ మంజునాథరెడ్డి మంగళవారం ఆందోళనకు దిగారు. 3.900 హెక్టార్లకు ప్రభుత్వం అనుమతి ఇవ్వగా కాంట్రాక్టర్ నిబంధనలు ఉల్లంఘించి ఇసుకను తవ్వుతున్నారని ఆరోపించారు. డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీ నరసింహం ఇసుక రీచ్ ప్రాంతాన్ని పరిశీలించారు. నిబంధనల మేరకే ఇసుక తవ్వుకోవాలని, మైనింగ్ డిపార్ట్‌మెంట్ అధికారుల పర్యవేక్షణ, నివేదికల తరువాతే ఇసుకను తరలించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎంపీటీసీ సభ్యులు నరసింహారెడ్డి, చంద్రారెడ్డి, మారుతీరెడ్డి, చిక్కన్న, కోఆప్షన్ మెంబర్ సలీం పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

గోరంట్ల: స్థానిక గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన అభయ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆ సంస్థ చైర్మన్ సుంకు బాలచంద్ర మంగళవారం ప్రారంభించారు. సాహితీ గగన్‌మహల్ సంస్థ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్పంచ్‌కు పరామర్శ

పరిగి: అనారోగ్యంతో చికిత్స పొంది పెద్దిరెడ్డిపల్లిలో విశ్రాంతి తీసుకుంటున్న కొడిగెనహళ్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ శ్రీరామప్పను ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత మాలగుండ్ల రవీంద్ర మంగళవారం పరామర్శించారు.ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ధైర్యంగా ఉండాలన్నారు.

'ప్రధాని మోదీని సాగనంపండి'

పెనుకొండ: జాతి సంపదను కార్పొరేటర్లకు దోచిపెడుతున్న ప్రధాని మోదీని సాగనంపాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు పిలుపునిచ్చారు. కేంద్ర సర్కార్ విధానాలను నిరసిస్తూ ఆ పార్టీ చేపట్టిన ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో మేలుకొలుపు యాత్ర నిర్వహించారు. శ్రీరాములు మాట్లాడుతూ బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలు, మతోన్మాద రాజకీయాల వల్ల దేశం భ్రష్టుపట్టిందన్నారు.

మలేరియాను తరిమి కొడదాం


రొళ్లలో మానవహారం

మడకశిర(అగళి): ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం అగళిలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మానవ హారం ఏర్పాటు చేసి మలేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమలతో వచ్చే వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ దోమతెరలు వినియోగించాలని వైద్యులు సూచించారు. మలేరియా మడకశిర సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి,డాక్టర్లు శివానంద,గాయత్రి పాల్గొన్నారు. లేపాక్షిలో డాక్టర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో, అమరాపురంలో డాక్టర్ మనోహర్ నాయక్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా మడకశిర మండలం కల్లుమర్రి, నీలకంఠాపురం, గుండుమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సోమందేపల్లిలో మండల వైద్యాధికారి నరేష్ ఆధ్వర్యంలో, రొళ్లలో మడకశిర మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పరిగిలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ స్వరూపరెడ్డి, డాక్టర్ నవీనా ఆధ్వర్యంలో, పెనుకొండ మండలం గుట్టూరులో వైద్యుడు నాగరాజునాయక్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మడకశిరలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్‌రావు, మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి, డాక్టర్ మంజుల పాల్గొన్నారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి

గుడిబండ: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... గుడిబండ మండలం ఫళారం గ్రామానికి చెందిన లక్ష్మమ్మ (70) శనివారం గ్రామ శివారులో బహిర్భూమికి వెళ్లి తిరిగి రాలేదు. అప్పటి నుంచి ఆమె ఆచూకీ కోసం కుటుంబసభ్యులు గాలిస్తున్నారు. మంగళవారం ఉదయం గ్రామ శివారులోని బావిలో లక్ష్మమ్మ మృతదేహం తేలాడుతుండడం గమనించిన గొర్రెల కాపరులు వెంటనే విషయాన్ని ఆమె కుటుంబసభ్యులకు చేరవేశారు. సమాచారం అందుకున్న పోలీసులు, కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. ప్రమాదవశాత్తు ఆమె బావిలో పడి మృతి చెందినట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారణ కావడంతో ఆ దిశగా మృతురాలి కుమారుడు బండేరంగప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎన్నికల్లో మద్దతివ్వండి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

పావగడ: తన తండ్రి వెంకటరమణప్పను ఆశీర్వదించినట్లుగానే తనను కూడా ఆదరించాలని కాంగ్రెస్ అభ్యర్థి హెచ్‌వీ వెంకటేశ్ యాదవ సముదాయానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎస్‌ఎస్‌కే సముదాయ భవనంలో మంగళవారం నిర్వహించిన యాదవుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో తనను గెలిపిస్తే తాలూకా వ్యాప్తంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతానన్నారు. ఎమ్మెల్యే వెంకటరమణప్ప మాట్లాడుతూ తన కుమారుడు వెంకటేశ్‌ను గెలిపించాలని కోరారు.

ఆదర్శంగా తీర్చిదిద్దుతా


సర్పంచ్ ప్రభావతిబాయిని సన్మానిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: ప్రభుత్వ సహకారంతో చందకచెర్లు పంచాయతీని అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని సర్పంచ్ ప్రభావతిబాయి అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కస్తూ ఉత్తమ పంచాయతీ పురస్కారాన్ని అందుకున్న సర్పంచ్‌ను మంగళవారం గ్రామ సచివాలయంలో కార్యదర్శి బ్రహ్మయ్య, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. సింగల్‌విండో అధ్యక్షులు రామిరెడ్డి, ఎంపీపీ కవిత, మాజీ ఎంపీపీ బజ్జప్ప, ఎంపీటీసీ భాగ్యమ్మ, కురుబ సంఘం నాయకులు మైలారప్ప పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి గ్రామోత్సవం


జ్యోతులతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు (ఇన్‌సెట్‌లో) కరి మారియమ్మ మూలవిరాట్

హిందూపురం టౌన్: స్థానిక మోడల్‌కాలనీలో కొలువైన కరి మారియమ్మ అమ్మవారి జ్యోతులు, గ్రామోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూల విరాట్‌ను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. మహిళలు జ్యోతులతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి సమర్పించారు. పూజారి హంసవేణి సుబ్రహ్మణ్యం, కౌన్సిలర్లు పార్వతీ, అంజలి, మినిస్ట్రీ ఆఫ్ సెంట్రల్ సీడ్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నిర్మల, శ్యామలమ్మ, లత, సుజాతమ్మ, అమృత, గోవిందరాజులు పాల్గొన్నారు.





వైభవంగా బ్రహ్మరథోత్సవం



గవి రంగనాథస్వామి రథోత్సవ దృశ్యం

హిందూపురం: హిందూపురం మండలం చలివెందుల గ్రామంలో వెలిసిన శ్రీలక్ష్మి గవి రంగనాథ స్వామి బ్రహ్మరథోత్సవం మంగళవారం వైభవంగా సాగింది. మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం పల్లకీలో శ్రీలక్ష్మి సమేత రంగనాథ స్వామి ఉత్సవమూర్తులను మేళతాళాలతో కొండపై నుంచి తీసుకువచ్చి రథంలో కొలువుదీర్చి రథోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉపేంద్రరెడ్డి భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

సీఎం పర్యటన విజయవంతం చేయండి

మడకశిర: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం అనంతపురం జిల్లా నార్పలకు వస్తున్నారని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

అరుణాచలంకు ప్రత్యేక బస్ సర్వీస్

హిందూపురం టౌన్: పౌర్ణమి సందర్భంగా స్థానిక ఆర్టీసీ డీపో నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్ సర్వీస్ నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. మే 4న సాయంత్రం 5గంటలకు హిందూపురం నుంచి బయల్దేరుతుందని తెలిపారు. వివరాలకు ఫోన్ నంబర్ 7382861542 కు సంప్రదించాలని కోరారు.

మార్కెట్‌కు పోటెత్తిన బైవోల్టిన్ పట్టుగూళ్లు

హిందూపురం: హిందూపురం మార్కెట్‌కు మంగళవారం బైవోల్టిన్ రకం పట్టుగూళ్లు 12.5 క్వింటాళ్లు వచ్చినట్లు మార్కెట్ అధికారి లక్ష్మిరెడ్డి తెలిపారు. 2023 ఏడాదిలో ఇదే అత్యధికమని తెలిపారు. కాగా ఏడీ సురేష్, మార్కెట్ అధికారి సమక్షంలో వేలం నిర్వహించారు. గరిష్టం రూ.580, కనిష్టం రూ.272 సగటు రూ.481 ప్రకారం క్రయవిక్రయాలు సాగాయని అధికారులు తెలిపారు.

వాసవీమాతకు పూజలు

హిందూపురం: వాసవీమాత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున నగర సంకీర్తన, సుప్రభాతసేవ, తిరుమంజన సేవ, పంచామృతాభిషేకాలు తదితర పూజలు నిర్వహించారు. వాసవీ భజన మండలి ఆధ్వర్యంలో వాసవీమాత జీవిత చరిత్రపై నిర్వహించిన నృత్య రూపకం ఆకట్టుకుంది.



అమ్మవారికి అలంకరణ













